క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మడకశిరరూరల్: అనంతపురం జిల్లాలో శని వారం నిర్వహించిన అండర్ 19 క్రీడా పోటీల్లో నీలకంఠాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని పీఈటీ రాజేష్ ఆదివారం తెలిపారు. అనంతపురంలోని ఆర్ఎస్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో రాష్ట్ర ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయన్నారు. రైఫిల్ షూటింగ్‌లో రాజు, పీప్‌సైట్‌లో ప్రజ్వల్, గణేష్, ఓపెన్‌సైట్‌లో శాలిని, పిస్టల్‌లో గిరిక ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల హెచ్ఎం చంద్రమౌళి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: మంగళవాడ పెట్రోల్ బంక్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోటబండె గ్రామానికి చెందిన ఈశ్వర్, నాగరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ ఆదివారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. మున్సిపల్ కౌన్సిలర్లు పీహెచ్ రాజేశ్, టెంకాయల రవి తదితరులు ఉన్నారు.

నలుగురికి గాయాలు

సోమందేపల్లి: మండలంలోని పేటకుంట సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమ డీఎస్సీ కంపెనీ ఎదుట ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పెనుకొండలోని కియా పరిశ్రమ వైపు నుంచి కొరియాకు చెందిన మిస్టర్ లీ , జింగ్‌చాంగ్ కిమ్, హంగుమచి, మోస్లీ బెంగళూరు వైపు కారులో వెళ్తున్నారు. ఈ సమయంలో కారు అదుపు తప్పి రోడ్డుపక్కనున్న బ్రిడ్జిని ఢీకొనింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నారాయణస్వామి తెలిపారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, పార్టీశ్రేణులు

గోరంట్ల: పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రెండువందల రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గోరంట్లలో భారీ బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. స్థానిక విజయకుమార్ పెట్రోల్ బంక్ నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గుమ్మయ్యగారిపల్లి సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. గుమ్మయ్యగారిపల్లి సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి,నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గడ్డం తండాలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

చిత్రలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం



గోవు పాలతో వెళ్తున్న అర్చకులు

రొళ్ల: యాదవుల ఆరాధ్యం దైవం చిత్రలింగేశ్వరస్వామికి అర్చకులు ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఆదివారం గంతికల్లుగొల్లహట్టి గ్రామానికి చెందిన యాదవ కులస్తులు యత్తప్పస్వామి పేరు మీద ఊరి పొలిమేరలో వదిలిన ఆవుల నుంచి పాలను సేకరించి అందులో నెయ్యి, పెరుగు తయారు చేసుకోవడంతో పాటు తెల్లవారుజామున పాలను సేకరించుకుని ఆలయ గర్భగుడిలోకి తీసుకొచ్చారు. తర్వాత కుమ్మరి ఇంటి నుంచి కొత్తగా తెచ్చిన మూడు కుండల్లోకి పాలను పోసి వేర్వేరుగా పెరుగు, నెయ్యితో నింపిన కుండలకు కొత్త దుస్తులు, పూలతో అలంకరించారు. అనంతరం కుండలను తలపై పెట్టుకుని కాలినడకన సుమారు 40 కి.మీ దూరంలోని కర్ణాటక రాష్ట్రం లక్కనహళ్లి వద్దనున్న చిత్రలింగేశ్వరస్వామి పోళి వద్దకు చేరుకున్నారు.

కలల గూడు.. నెరవేరింది చూడు!



- ఈచిత్రంలో కనిపిస్తున్న ఈమెపేరు నూర్జహాన్. ఎన్నో ఏళ్లుగా ఇల్లు లేక ఈమె కుటుంబం అవస్థలు పడుతోంది. సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందోనని బెంగ ఉండేది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ అనేకమార్లు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. పిల్లలను చదివించుకోవడం, కుటుంబం గడుపుకోవడమే కష్టంగా ఉండేది. ఇక అద్దె చెల్లించాలంటే గగనమయ్యేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అర్హత ఉంటే చాలు.. అడగకపోయినా, పేదల అవస్థలు చూసి ప్రతి ఒక్కరికీ సొంతిల్లు మంజూరు చేశారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణం పూర్తయ్యి, మా కంటూ సొంతిల్లు ఉందని ధీమా వచ్చిందని ఈమె చెప్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆనందంగా చెప్తోంది.



కుమ్మరవీధి సమీపంలోని జగనన్న కాలనీలో ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలు

- అర్హులందరికీ జగనన్న కాలనీల్లో ఇళ్లు
- జోరుగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు
- ఇప్పటికే ఇళ్లలోకి చేరుకున్న పేదలు

పెనుకొండ: జగనన్న ఇళ్ల నిర్మాణంతో పేద కుటుంబాల్లో ఎంతో సంతోషం నెలకొంది. పెనుకొండ మండలంలో మొత్తం 2011 ఇళ్లు మంజూరయ్యాయి. 2013లో అప్పటి ప్రభుత్వం అనేక మంది పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేసింది. అనంతరం టీడీపీ హయాంలో పేదలను పట్టించుకోలేదు. పేదలు తహసీల్దార్, సబ్ కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితంలేకపోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి, ప్రతి ఇంటా సర్వే చేసి, అవసరమైన వారందరికీ ఇళ్లు మంజూరు చేశారు. ప్రస్తుతం అనేక ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. కొందరు ఇప్పటికే కాలనీల్లో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం అర్బన్ కాలనీతో పాటు పలుచోట్ల జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు చూస్తే ఊళ్లే నిర్మితమవుతున్నాయని ప్రజలు అంటున్నారు.

పెనుకొండ మండలంలో మంజూరైన ఇళ్లు, వాటి నిర్మాణ తీరు ..

మండలంలో మొత్తం ఇళ్లు	2011
నిర్మాణం ప్రారంభం కానివి	01
బేస్‌మెంట్ లోపలే ఉన్నవి	268
బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న ఇళ్లు	604
రూఫ్ లెవల్‌లో ఉన్నవి	176
ఆర్‌సీ లెవల్లో ఉన్నవి	35
ఇళ్ల నిర్మాణం పూర్తయినవి	927



పెనుకొండలో జోరుగా సాగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణం



పూర్తయిన జగనన్న ఇళ్లు

కల నెరవేరింది



ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడ్డాం. బాడుగలు చెల్లించలేక నానా కష్టాలు పడ్డాము. ఎట్టకేలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో నా భార్య మున్నీరా పేరిట ఇల్లు మంజూరయ్యింది. అధికారులు బిల్లులు మంజూరు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇల్లు నిర్మించుకుంటున్నాం. జగనన్న రుణం తీర్చుకోలేనిది. – జిక్రియ, పెనుకొండ

త్వరలో ఇళ్లు ప్రారంభిస్తాం

జగనన్న ఇళ్ల నిర్మాణ విషయంలో రాజీ పడలేదు. లబ్ధిదారులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నాం. వారికి సకాలంలో సిమెంట్ సరఫరా చేయిస్తున్నాం. బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నాం. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. త్వరలో ఇళ్లన్నింటినీ ప్రారంభించనున్నాం. – శ్రీనాథ్, హౌసింగ్ ఏఈ, పెనుకొండ

చౌళూరు రామకృష్ణారెడ్డికి నివాళి



చౌళూరు రామకృష్ణారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మధుమతిరెడ్డి, భార్య జ్యోత్స్న రెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు

హిందూపురం: చౌళూరు గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతి జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, జ్యోత్స్న రెడ్డి, తల్లి నారాయణమ్మ ఆధ్వర్యంలో రామకృష్ణారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి, మాజీ సమన్వయకర్తలు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, బాబురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

మిన్నంటిన నినాదాలు

చౌళూరు రామకృష్ణారెడ్డి ప్రథమ వర్ధంతికి గ్రామస్తులు, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రామకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ రాము అన్న అంటూ నినాదాలు చేశారు. కుటుంబ సభ్యులు సముదాయించి ఓదార్చారు. కార్యక్రమంలో పెనుకొండ వైఎస్సార్‌సీపీ నాయకులు సల్లపల్లి బాబురెడ్డి, సానే ఉమారాణి, మద్దలచెరువు సురేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, జిల్లా నాయకులు ఇలియాజ్, ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు శివ, అసీఫ్‌వుల్లా, రామచంద్ర, నాగరాజు, చంద్ర, నాగమణి, పట్టణ బీబ్లాక్ కన్వీనర్ నరేష్, జేసీఎస్ జిల్లా కన్వీనర్లు మారుతిరెడ్డి, కన్వీనర్లు శివశంకర్‌రెడ్డి, గిరి, కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు బాలాజీ మనోహర్, జమీల్, లైఫ్ వర్ల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్, రెడ్డి సంఘం నాయకులు నరేష్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

లేపాక్షి: లేపాక్షి బస్టాండు సమీపంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి వర్ధంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, నంజిరెడ్డి, నిస్సార్, రహంతుల్లా, శ్రీనివాసులు, నరసప్ప, జగన్నాథరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

28 వరకూ సురక్ష క్యాంపులు

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఈనెల 10వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ జగనన్న సురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. 10వ తేదీన నింకంపల్లి అర్బన్ హెల్త్‌సెంటర్‌లో డాక్టర్ అయిషా తస్నీమ్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ జరుగుతుందన్నారు. 16వ తేదీన 13, 14, 19, సడ్లపల్లి, సూగురు, ఇందిరానగర్ ప్రాంతాల వారికి ఇందిరానగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వైద్య పరీక్షలు చేస్తారన్నారు. 17వ తేదీన 24, 25, 26, కంసాలపేట, మెయిన్ బజారు, అజాద్‌నగర్‌లో డాక్టర్ అయిషా తస్నీమ్ ఆధ్వర్యంలో అర్బన్‌హెల్త్ సెంటర్ నింకంపల్లి వద్ద పొట్టిశ్రీరాములు మున్సిపల్ స్కూల్ వద్ద వైద్య శిబిరం ఉంటుందని తెలిపారు. 18వ తేదీన 27, 28, అబాద్‌నగర్, కోటా ఏరియా–2 ప్రాంతాలకు చెందిన వారికి అర్బన్‌హెల్త్ సెంటర్ నింకంపల్లి వద్ద పొట్టిశ్రీరాములు మున్సిపల్ స్కూల్ వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. 19వ తేదీన 15, 16, 41 సచివాయ కేంద్రాలతో పాటు రహమత్‌పురం, రహమత్‌పురం1, 2 డాక్టర్ కిరణ్మయిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం సాగుతుందన్నారు. 20వ తేదీన 17, 18 కోటా–1, బోయపేట ఏరియాలకు ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద వైద్య పరీక్షలు చేస్తామన్నారు. 26వ తేదీన 3, 4, 40 సచివాలయ కేంద్రాలతో పాటు ఆర్టీసీ కాలనీ 1, 2, 3 ప్రాంతాలకు డాక్టర్ మంజుశ్రీ ఆధ్వర్యంలో లక్ష్మీపురం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వైద్య శిబిరం సాగుతుందన్నారు. 27వ తేదిన 6, 11, 12, 43 సచివాలయ పరిధిలోని ప్రాంతాలతో పాటు ధరంపురం 1, 2, మోడల్‌కాలనీ 1, 2 ప్రాంతాల వారికి లక్ష్మీపురం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వైద్యశిబిరం సాగుతుందన్నారు. 28వ తేదీన లక్ష్మీపురం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వైద్య శిబిరం జరుగుతుందన్నారు.

విజయవాడకు తరలిన వైఎస్సార్‌సీపీ నాయకులు



బస్సులో విజయవాడకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సదస్సుకు బయలు దేరుతున్న ప్రజాప్రతినిధులు

హిందూపురం: విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల సదస్సుకు సమన్వయకర్త టిఎన్.దీపిక అధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మెన్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, మండల, పట్టణ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు నాయకులు పెద్ద ఎత్తున బయలు దేరారు.

మడకశిర: విజయవాడలో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధుల సభకు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి నాయకత్వంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రత్యేక బస్సులో బయలుదేరారు. విజయవాడ వెళ్లిన వారిలో నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండలాల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ తదితరులు ఉన్నారు.

రొద్దం: మండలంలోని పలువురు వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు ఆదివారం విజయవాడకు తరలివెళ్లారు. సోమవారం విజయవాడలో నిర్వహించనున్న సభలో పాల్గొనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రడవిశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కలిపి శ్రీనివాసులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

గోరంట్ల: అర్హులందరికీ కులమత,రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మండలంలోని గడ్డంతండా పంచాయతీ పరిధిలోని కల్లితండా, గడ్డం తండా, కొత్తపల్లితండా, కొమ్మలతండా గ్రామాల్లో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని తెలియజేశారు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకొని సత్వర పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి కులమత రాజకీయలకతీతంగా అర్హులను ఎంపిక చేసి, సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో పేదల సంక్షేమంకోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచు వాసునాయక్, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షులు నూర్ మహమ్మద్, సర్పంచులు, ఎంపీటీసీసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడి మృతి



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి

చిలమత్తూరు: కంబాలపల్లికి చెందిన మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సురేంద్రరెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి కోలుకుంటున్న సమయంలో ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి కంబాలపల్లికి చేరుకుని సురేంద్రరెడ్డి మృతదేహానికి నివాళలర్పించారు. అనంతరం ఆయన కుమారుడు సుదర్శన్‌రెడ్డిని ఓదార్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ మంజునాథ్‌రెడ్డి, శెట్టిపల్లి స్వామి, చాంద్ బాషా, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్స్ డే



పాస్టర్ స్టీఫెన్ రాజును సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చ్‌లో ఆదివారం పాస్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘం పెద్దలు, డీకెన్‌లు, సభ్యులు కలసి సంఘం పాస్టర్ రెవరెండ్ స్టీఫెన్ రాజుకు బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. క్రైస్తవ సంఘాల్లో పాస్టర్లు చేస్తున్న సేవలకు గుర్తుగా అక్టోబర్ నెల రెండవ ఆదివారం పాస్టర్స్ అప్రిషియేషన్ డే జరుపుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ విక్టర్ జాషువా, జాయింట్ ట్రెజరర్ ఆనంద్ రాజు, డీకెన్ సభ్యులు జార్జి బాబు, సాల్మన్ రాజు, యూత్ ఫెలోషిప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బండారు సత్యనారాయణపై చర్యలు తీసుకోండి

అమరాపురం: పర్యాటక శాఖ మంత్రి రోజా పైఅనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ టీడీపీ నేతలు మహిళలపై అసభ్యకరంగా మాట్లాడడం మానుకోవాలన్నారు. బండారు లాంటి చీడ పురుగుల్ని ఏరి పారేయాల్సిన అవసరం ఉందన్నారు. బండారుపై క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఆమె కోరారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం: ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సంతేబిదనూర్ ఆయుర్వేద వైద్యురాలు అనూరాధ అన్నారు. ఆదివారం పట్టణంలోని అష్టలక్ష్మి ఆలయంలో ఆవోపా ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కీళ్లవాతం, ఆయాసం, తలనొప్పి, పైల్స్, పక్షవాతం, శరీరంలో నొప్పులు, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవోపా సంఘం అధ్యక్షుడు సతీష్, కార్యదర్శి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంకరనారాయణ వాహనంపై దాడి హేయం



ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న కురుబ సంఘం నాయకులు

పెనుకొండ: ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ వాహనంపై డిటోనేటర్‌తో దాడి చేయడం హేయమైన చర్య అని కురుబ సంఘం నాయకులు అన్నారు. పెనుకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి కురుబలు పెద్ద ఎత్తున తరలి వచ్చి, ఆయన్ను పరామర్శించారు. వారు మాట్లాడుతూ బీసీ వర్గాల పక్షపాతి అయిన శంకరనారాయణపై దాడి దారుణమైన సంఘటన అన్నారు. ఇందుకు కారణమైన వారిని గుర్తించి, శిక్షించాలని కోరారు. ఎమ్మెల్యేకు భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



క్రికెట్ కిట్ అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ సూచించారు. బుడ్డయ్యపాళ్యంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో క్రికెట్ కిట్ అందించాలని విద్యార్థులు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు క్రికెట్ కిట్ అందించినట్లు వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

మందుబాబులకు అడ్డాగా కొండ ప్రాంతాలు



కొండ ప్రాంతంలో తాగి వదిలేసిన మద్యం బాటిళ్లు

పెనుకొండ రూరల్: పెనుకొండ కొండ ప్రాంతాలు మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. పట్టణ శివారులోని మడకశిర ప్రధాన రహదారి, అరటి మండి, కొండ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం బాటిళ్లు కనిపిస్తున్నాయి. రహదారి గుండా మహిళలు ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు.

మడకశిరపై ధర్మవరం విజయం



క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అండర్–15 విభాగంలో మిక్స్‌డ్ ఏపీఎల్ క్రికెట్ లీగ్ మ్యాచ్ జరిగింది. ధర్మవరం, మడకశిర మధ్య జరిగిన మ్యాచ్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు నాగేంద్ర ప్రారంభించారు. మడకశిర జట్టుపై ధర్మవరం జట్టు విజయం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కోచ్‌లు విజయ్, రాజశేఖర్, సీనియర్ క్రీడాకారుడు వేణు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోరంట్ల: మండలంలోని ఖాజాపురం సమీపంలో గోరంట్ల – పుట్టపర్తి రోడ్డుపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. మందలపల్లి గోపాలమిత్రగా పని చేస్తున్న రంగ్లానాయక్‌తో పాటు మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై గోరంట్లకు వెళ్తున్నారు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈప్రమాదంలో రంగ్లానాయక్ తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.